క్లుప్తంగా

రూ.2.27 కోట్లతో గ్లో గార్డెన్ పార్క్



పార్క్ పనులకు శంకుస్థాపన చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి

సీతమ్మధార: నగరంలోని డాక్టర్ వైఎస్సార్ సెంట్రల్ పార్కులో వీఎంఆర్‌డీఏ నిధులు రూ.2.27 కోట్లతో ఎల్‌ఈడీ గ్లో గార్డెన్ పార్క్ పనులకు శనివారం సంస్థ చైర్మన్ సనపల చంద్రమౌళి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రెండోదిగా ఏర్పాటు చేస్తున్న గ్లో గార్డెన్ పార్క్ విశాఖకే తలమానికమన్నారు. ఇందులో ఏర్పాటు చేసే వివిధ పక్షులు, జంతువులు ఎల్‌ఈడీ కళాకృతులు చూపరులను అమితంగా ఆకట్టుకుంటాయని చెప్పారు. కార్యక్రమంలో విప్ శాసన మండలి సభ్యురాలు వరుదు కల్యాణి, కార్పొరేటర్ బిపిన్ జైన్, జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, సీఈ భవానీశంకర్, ఎస్‌ఈ బలరాంరాజు, రేంజర్ శ్యామల, కార్యనిర్వాహక ఇంజినీర్లు ఎస్.వి.ఎస్.ఎన్. రాజు, బొట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం



నాగరాజు (ఫైల్)

దాబాగార్డెన్స్ : కేజీహెచ్ ఓపీ నుంచి ఈ నెల 6న 69 ఏళ్ల వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ మేరకు వృద్ధుడి కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి. రీజు నాగరాజు (69) ఈ నెల 6 ఉదయం 4.30 గంటలకు కేజీహెచ్ ఓపీ నుంచి బయటికి వెళ్లిపోయాడని, అప్పటి నుంచి అతను కనిపించకుండా పోయాడని నాగరాజు కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 98482 74413, 94407 96019 నంబర్లలో తెలపాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

దాబాగార్డెన్స్ : ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల కమిటీల ప్రతినిధులను నియమించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు, ఉపాధ్యక్షుడు రెడ్ల వీర రాఘవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడిగా మట్టా ప్రసాద్, అర్బన్ అధ్యక్షుడిగా పొంద్రంకి వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా గంగునాయుడు, ప్రధాన కార్యదర్శిగా లగిశెట్టి సూర్య వెంకటప్రసాద్‌ను నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివాజీ, అల్లం రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో చోరీల నియంత్రణ



దొండపర్తి వాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని దొండపర్తిలో శనివారం సీసీ కెమెరాలు, దొంగతనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు కాల్ చేసి సమాచారమందించాలని స్థానికులకు సూచించారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంచరాదని, బ్యాంక్‌లో భద్రపరచడమే మేలన్నారు. ఊళ్లు వెళ్లేటప్పుడు ఇంటికి జాగ్రత్తగా తాళం వేయాలన్నారు. చోరీలు జరిగినప్పుడు పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మచేతి స్పర్శలా..

- గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ
- బలవర్ధక ఆహారం అందించడంపై లబ్ధిదారుల హర్షం

చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం

స్కూళ్లలో రోజుకు 100 మిల్లీలీటర్ల పాలు ఒక ఉడికించిన గుడ్డు

మెనూ ప్రకారం భోజనం

సోమవారం: ఆనపకాయ, పప్పు
మంగళవారం: పులిహోర, సాంబారు
బుధవారం: అన్నం, ఆకుకూర పప్పు
గురువారం: అన్నం, ఆకుకూర
శుక్రవారం: సాంబారు, అన్నం
శనివారం: బిర్యానీ, పప్పు



పండా వీధి బాలింతకు టేక్‌హోం రేషన్ అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి

జగదాంబ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులకు ఒక గుడ్డు, పాల ప్యాకెట్‌తో సరిపెట్టే రోజులు పోయాయి. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఆలనా పాలనా లేకుండా వదిలేసిన అంగన్‌వాడీ కేంద్రాలను మోడరన్ ప్రీ చిల్డ్రన్ స్కూళ్లుగా తీర్చిదిద్దడమే కాకుండా వారికి ఇచ్చే భోజనం మెనూలో అనేక మార్పులు చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లు అందిస్తు ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. టేక్ హోం కింద ఇంటికే సరుకులు పంపిణీ చేస్తుంటే మరో పక్క చిన్నారులు, పుట్టే బిడ్డలు రక్తహీనతతో బాధపడకుండా ఆరోగ్యవంతమైన డ్రై రేషన్ అందిస్తున్నారు. అంతే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ బాధ్యతలను అధికారులకు అప్పగించారు.

జీవీఎంసీ 35వ వార్డులో..

జీవీఎంసీ 35వ వార్డులో కల్లుపాకలు ప్రాంతంలో 2, పండావీధిలో 1, ప్రసాద్‌గార్డెన్స్‌లో 2, వెలంపేటలో 1, మేదరవీధిలో 1, పువ్వుల వీధిలో 1 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో సుమారు రెండు వందల మంది చిన్నారులు, 66 మంది గర్భిణులు, 69 మంది బాలింతలకు సేవలందిస్తున్నారు. వీరందరికీ గతంలో భోజనాలు వండి పెట్టేవారు. ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో ఇంటికే రేషన్ పంపిణీ చేస్తున్నారు. అంతే కాకుండా 6 నెలల నుంచి 2 సంవత్సరాలోపు పిల్లలకు రెండున్నర కేజీల బాలామృతం పిండి, నెలకు 25 గుడ్లు, రెండున్న లీటర్ల పాలు అందిస్తున్నారు.

బాలింతలకు..

ఇంటికి 15 రోజులకు ఒకసారి ఒకటో తేదీ నుంచి 5వ తేదీలోపు వైఎస్సార్ కిట్టు, వైఎస్సార్ బ్యాగ్‌తో పాటు రెండు కేజీల రాగి పిండి, కేజీ అటుకులు,



బాలింతకు వైఎస్సార్ పోషణ ప్లస్ కిట్లు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్

పావు కేజీ బెల్లం, పావు కేజీ బెల్లం చెక్కీ, పావు కేజీ ఖర్జూరం, మూడుకేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అరకేజీ ఆయిల్, 13 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అందజేస్తున్నారు. రెండో విడతగా నెలలో 16వ తేదీ నుండి కూడా అందజేస్తున్నారు.

ప్రభుత్వం అందిస్తున్న సేవలు బాగున్నాయి..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు బాగున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకెళ్లి తెచ్చుకునే రోజులు పోయాయి. ఇంటి వద్దకే పోషణ కిట్లు పంపిణీ చేస్తున్నారు. చక్కటి పోషకాహారం అందజేస్తున్నారు.
– కొత్తల వరలక్ష్మి, బాలింత, పండావీధి, 39వ వార్డు

సరుకులు పెరిగాయి..



వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్ల ద్వారా అందించే సరుకులు పెరిగాయి. గతంలో భోజనం పెట్టి పంపించేవారు. ఇప్పుడు నెలంతటికీ రెండున్నర లీటర్ల పాలు, 25 గుడ్లతో పాటు పోషణకు సంబంధించి ఆరు రకాల సరుకులు అందిస్తున్నారు.
– జగ్గా భవానీ, బాలింత, పండావీధి, 35వ వార్డు

టేక్ హోం విధానం బాగుంది..



నెలలు నిండిన మాలాంటి గర్భిణులకు టేక్ హోం ద్వారా ఇంటికి పోషణ కిట్లు పంపే విధానం బాగుంది. డ్రై రేషన్ వల్ల రక్తహీనత సమస్య నుండి బయటపడొచ్చు. మంచి కార్యక్రమం అమలు చేస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు.
– వరి సన్యాసమ్మ, గర్భిణి, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్ : విశాఖ పోర్ట్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో నైపుణ్య భారతి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల యువతీ యువకులకు శనివారం కుట్టు మిషన్లు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా శనివారం ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లో గల కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో నైపుణ్య భారతి ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధులు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక యల్లమ్మ అమ్మవారి తొలేళ్లు



విశేష అలంకరణలో రేణుక యల్లమ్మ అమ్మవారు



విద్యుత్ దీపాలంకరణలో అమ్మవారి ఆలయం

అల్లిపురం : కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవంలో భాగంగా శనివారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి ఆలయ గౌరవాధ్యక్షుడు పీల అప్పలనాయుడు, ఆలయ కార్యవర్గ సభ్యులు తొలిపూజ నిర్వహించారు. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు అచ్చియ్యమ్మపేట వీధులన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. అమ్మవారి జన్మ నక్షత్రమైన మృగశిరలో ప్రధాన జాతర ఆదివారం ఉదయం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు పీల అప్పలనాయుడు, ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు తెలిపారు. సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవారి అనుపు ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

దోమలతో సతమతం

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 39వ వార్డు పరిధి కోటవీధి తదితర ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంజాన్‌మాసం ఉపవాస దీక్షలో ఉండే ముస్లింలు ఉదయం నుంచి పొద్దుపోయే వరకు ఉపవాసంతో ఉంటూ కాస్త తిని పడుకునేందుకు సిద్ధపడుతున్న సమయంలో దోమలు విజృంభిస్తున్నాయని, ఫలితంగా రాత్రిళ్లు నిద్రించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయమై జీవీఎంసీ గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేసినా స్పందించే నాథుడే కరువయ్యాడని, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు విష జ్వరాల బారిన పడక ముందే జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

త్యాగధనుడు పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ మల్లికార్జున



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ రవిశంకర్

దాబాగార్డెన్స్ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి శనివారం నిర్వహించారు. ముందుగా ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ సూకరాజు అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎల్. రాజేంద్రవర్మ అమరజీవి పొట్టి శ్రీరాములు గురించి మాట్లాడారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శప్రాయం..

విశాఖ సిటీ : అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం నేటి తరానికి ఆదర్శమని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పేర్కొన్నారు. శనివారం పొట్టి శ్రీరాములు జయంతిని కమిషనరేట్‌లో నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసి తెలుగువారి దృఢ సంకల్పానికి పొట్టి శ్రీరాములు నిదర్శనంగా నిలిచారని తెలిపారు.

కలెక్టరేట్‌లో..

మహారాణిపేట : త్యాగధనుడు పొట్టి శ్రీరాములుకు కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ఘన నివాళి అర్పించారు. శనివారం అమరజీవి జయంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి అమరజీవికి అంజలి ఘటించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో బీఎస్ దేవ్‌ప్రసాద్, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ ఉద్యోగులు

నేడు భువనేశ్వరికి అధివాసం

దాబాగార్డెన్స్ : శ్రీ భువనేశ్వరి ఆరాధన పీఠంలో అమ్మవారి విగ్రహానికి ఆదివారం రావిదళాలతో అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు ఓం భువనేశ్వరి సంస్థాన్ ట్రస్ట్ నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. ఈ మహోత్సవం మణిపురం చెల్లయ్యమ్మతోట యాతపాలెంలో గల ఆలయం వద్ద నిర్వహించనున్నట్టు చెప్పారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా సత్యపద్మ



సత్యపద్మకు స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎం.సత్యపద్మ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఆమె ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఈడీ కార్యాలయం ఉద్యోగులు ఆహ్వానం పలికారు. అంతకుముందు సత్యపద్మ.. జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రజాభిమానపాత్రుడికి బ్రహ్మరథం



ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లిని సత్కరిస్తున్న అభిమానులు

- దక్షిణలో వాసుపల్లికి పార్టీ టిక్కెట్ పట్ల స్థానికుల హర్షం

దాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గంలో యుద్ధం మొదలైంది. ఈ యుద్ధం వైఎస్సార్‌సీపీ నుంచి వాసుపల్లి గణేష్‌కుమార్, టీజేబీ నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ మధ్య జరగనుంది.

మోగిన ఎన్నికల గంట..

కేంద్ర ఎన్నికల కమిషన్ శనివారం ఎన్నికల ప్రక్రియకు సంబంధించి నొటిఫికేషన్ విడుదల చేసింది. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేసే అభ్యర్థులను పార్టీ అధినేత ప్రకటించారు. ఎప్పటి నుంచో నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్‌ను దక్షిణ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించారు. పొత్తులో భాగంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ(టీజేబీ) పొత్తు అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్‌కు దక్షిణ నియోజకవర్గం సీటు కేటాయించారు.

సేవల్లో ముందున్న వాసుపల్లి..

వైఎస్సార్‌సీపీ తరఫున దక్షిణ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన వాసుపల్లి గణేష్‌కుమార్ సేవా కార్యక్రమాల్లో దూసుకుపోతున్నారు. వారంలో సోమవారం డయల్ యువర్ ఎమ్మెల్యే, మంగళ, శుక్ర వారాల్లో ప్రజాదర్బార్, శనివారం కార్యకర్తల గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. బుధ, గురువారాల్లో ప్రజాదర్బార్‌లో వచ్చే వినతుల పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి వెళ్లి పరిష్కరించడం.. నియోజకవర్గంలో ఎవరు ఆపదలో ఉన్నా మీకు నేనున్నాను అంటూ భరోసా కల్పిస్తూ ఎంతో మంది నిరుపేదలు.. మంచాన పడిన పేషెంట్లు, వృద్ధులకు సొంత నిధుల నుంచి ఆర్థిక సాయం చేస్తున్నారు. నిరుపేదలు ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలకు ఆర్థిక సాయం చేస్తున్నారు. అంతే కాక పండగలు.. ఉత్సవాల్లో పాల్గొంటూ ఘనంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఉత్సవ కమిటీలకు ఆర్థిక సాయం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టే ప్రయత్నంలో వాసుపల్లి తన సేవల ద్వారా ముందుకు దూసుకుపోతున్నారు.

వెనక్కి తగ్గిన జన నేతలు..

ఎన్నికలకు సంబంధించి టీజేబీ అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం ప్రచారం ప్రారంభించారు. ఇదిలా ఉండగా దక్షిణ నియోజకవర్గం నుంచి జనసేన టికెట్ ఆశించి భంగపడ్డ మహ్మద్ సాధిక్, కందుల నాగరాజు ప్రచారంలో కానరాలేదు.

వాసుపల్లి కార్యాలయం వద్ద సంబరాలు..

దక్షిణ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వాసుపల్లిని పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలేసింది. బాణసంచా కాల్చి.. నగర వీధుల్లో విహరించారు. జై వాసుపల్లి.. జైజై జగన్ అంటూ నినాదాలతో కేరింతలు కొట్టారు. గజమాలలతో వాసుపల్లిని సత్కరిస్తూ విజయం మనదే..అంటూ జైకొట్టారు.



బాణసంచా కాలుస్తున్న అభిమానులు

ప్రాణదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

- రూ.12 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన వాసుపల్లి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచిన ప్రాణదాత మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కొనియాడారు. ప్రజల గుండె చప్పుడు తెలిసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లో గల వాసుపల్లి కార్యాలయంలో శనివారం ఉదయం రూ.12 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 14 మందికి అందజేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం పొందలేని పేదలు, వైద్యం కోసం చేసిన ఖర్చుకు సంబంధించిన ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి లేఖ ద్వారా అభ్యర్థించినట్లు తెలిపారు. పేదల పెన్నిధి జగనన్న వెంటనే స్పందించి నిధులు విడుదల చేశారన్నారు. ఇటీవల రూ.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు కూడా బాధితులకు అందజేశామన్నారు. ఎంతో మంది నిరుపేదలకు ప్రాణభిక్ష పెట్టిన జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మనమంతా అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇటీవల దక్షిణ నియోజకవర్గంలో 30 ఏళ్ల టీడీపీ వార్డు అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి అల్లుడు చనిపోతే వైద్య ఖర్చుల కోసం రిలీజ్ అయిన రూ.2.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించామని వాసుపల్లి తెలిపారు. కులం, మతం, పార్టీలు చూడకుండా సుపరిపాలన అందిస్తామనడానికి పై ఉదాహరణే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కార్పొరేటర్లు, వార్డు నాయకులు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లి ఔదార్యం

- 11 మంది రోగులకు రూ. 53 వేలు అందజేత



రోగులకు ఆర్థిక సాయం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి కుమారుడు సూర్య

మహారాణిపేట : మీ నిండైన మనసుతో ఆశీర్వదించి, దీవెనలందించాలని దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కుమారుడు సూర్య బాధితులను అభ్యర్థించారు. దీనికి స్పందించిన రోగుల కుటుంబాలు బదులిస్తూ తమకు నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేసే నాయకుడు గణేష్‌కుమార్ అన్నను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకునే బాధ్యత తమదని ముక్తకంఠంతో తెలిపారు. తండ్రి ఒకపక్క తనయుడు మరోపక్క నిరుపేదలకు అందిస్తున్న ఆర్థిక సాయం పట్ల ప్రశంసలు పొందుతున్నారు.

నిరంతరం ప్రజాసేవలో భాగంగా శనివారం ఉదయం 11 మంది రోగులకు రూ.53 వేలు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి కుమారుడు వాసుపల్లి సూర్య ఇంటింటికీ వెళ్లి అందజేశారు. 34వ వార్డు కొబ్బరితోటకు చెందిన బత్తిన సృజన, 35వ వార్డు దుర్గమాంబ సమాజానికి చెందిన బత్తిన రాజమ్మ, కల్లుపాకలుకు చెందిన బోడమ్మ, బండి కుమార్, 36వ వార్డు సున్నపువీధికి చెందిన చల్ల లక్ష్మి, 37వ వార్డు జబ్బర్‌తోటకు చెందిన బడే రామాయమ్మ, ఆసిపాప వీధికి చెందిన బర్ల కుమారి, 30వ వార్డు కోడిపందేలవీధికి చెందిన జలగడుగుల కనకరాజు, 30వ వార్డు జాలరిపేటకి చెందిన వాడమొదుల ప్రదీప్, రెల్లివీధికి చెందిన భూపతి పార్వతి, 36వ వార్డు కాకర వీధికి చెందిన మహమ్మద్ రఫీ తదితరులకు ఆర్థికసాయం అందించారు. అలాగే వాసుపల్లి కార్యాలయంలో 37వ వార్డు జబ్బర్‌తోట సచివాలయం వలంటీర్ సుకల భవానీ తండ్రి వంకా జానకిరావు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి రూ.5 వేలు అందించారు. ఏ కష్టమైనా తానున్నానంటూ ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కార్పొరేటర్లు, అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ప్రయాణించే రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. మిగిలిన రైళ్లు యథావిధిగా నడుస్తాయన్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మచిలీపట్నం–విశాఖ (17219) ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 2వ తేదీ నుంచి 29వ తేదీ తేదీ వరకు విశాఖ– మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు విశాఖ –గుంటూరు –విశాఖ (22701/22702) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. ఈ రైళ్లు నిడదవోలు–ఏలూరు– విజయవాడ మీదుగా కాకుండా మళ్లించిన మార్గంలో వయా నిడదవోలు–భీమవరంటౌన్–గుడివాడ–విజయవాడ మీదుగా ప్రయాణిస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. వచ్చే నెల 1, 8, 15, 22 తేదీల్లో ఎర్నాకుళం–పాట్నా(22643) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్.. 3, 5, 10, 12, 17, 19, 24, 26 తేదీల్లో ఎస్ఎంవీ బెంగళూరు–గౌహతి(12509) సూపర్‌ఫాస్ట్.. 1, 3, 5, 6, 8, 10, 12, 13, 15, 17, 19, 20, 22, 24, 26, 27 తేదీల్లో ముంబయి–భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్.. వచ్చే నెల 1 నుంచి 28 వరకు ధన్‌బాద్–అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్.. 4, 11, 18, 25 తేదీల్లో టాటానగర్–యశ్వంత్‌పూర్(18111) ఎక్స్‌ప్రెస్.. 3, 10, 17, 24 తేదీల్లో జసిద్ది –తాంబరం (12376)ఎక్స్‌ప్రెస్.. 1, 8, 15, 22 తేదీల్లో హతియా– ఎర్నాకుళం(22837) ఏసీ ఎక్స్‌ప్రెస్.. 6, 13, 20, 27 తేదీల్లో హతియా–ఎస్ఎంవీ బెంగళూరు(18637) ఎక్స్‌ప్రెస్.. 2, 7, 9, 14, 16, 21, 23, 28 తేదీల్లో హతియా–ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్.. 5, 12, 19, 26 తేదీల్లో టాటానగర్–ఎస్ఎంవీ బెంగళూరు(12889) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

ఘనంగా వెంకన్న తీర్థం

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శి పట్టిమ రాజు ఆధ్వర్యంలో శనివారం తీర్థ(పరస) మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి జగనాథశర్మ, శంకరశర్మ నేతృత్వంలో ఉదయం విశేష పూజలు, సుప్రభాత సేవ నిర్వహించారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వేంకటేశ్వరుడికి ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన, మంగళశాసనాలు, పంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం పరసలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.